క్లుప్తంగా

సీఎం సహాయనిధి చెక్కు అందజేత



పాన్‌గల్: మండలంలోని అన్నారంతండాకు చెందిన రాత్లావత్ రాజుకు మంజూరైన రూ. 37,500 సీఎం సహాయనిధి చెక్కును ఆదివారం కాంగ్రెస్ నాయకులు రేక్యానాయక్, ప్రేమ్‌నాయక్ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సీఎం సహాయనిధితో పేదలు కార్పొరేటు ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకుంటున్నారన్నారు. చెక్కు మంజూరు చేయించిన మంత్రి జూపల్లికి, సహకరించిన మండల నాయకులకు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో తండా కాంగ్రెస్ నాయకులు బిక్యానాయక్, రమేష్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

తవ్వారు.. వదిలేశారు!



వనపర్తి రూరల్: వనపర్తి నుంచి పెబ్బేరుకు వెళ్లే ప్రధాన రహదారిపై తిరుమల్లయ్యగుట్ట సమీపంలో సుమారు నెల క్రితం రోడ్డు సైడ్ గుంతను తవ్వి వదిలేశారు. రోడ్డు వెంబడి ఇంటర్‌నెట్‌కేబుల్ కోసం గుంతను తవ్వి వదిలేయడంతో వాహనదారులకు ప్రమాదకరంగా మారింది. ఓ పక్క మలుపు, సింగిల్ రోడ్డు కావడంతో రాత్రి వేళలో ద్విచక్ర వాహనదారులు, పెద్ద వాహనాలు ఎదురైతే ప్రమాదం జరిగే అవకాశం ఉంది. అధికారులు స్పందించి గుంతను పూడ్చాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ముళ్లపొదలను తొలగించండి



వీపనగండ్ల: గోపల్‌దిన్నె రిజర్వాయర్‌కు వెళ్లే ప్రధాన రహదారికి ఇరువైపుల ఏపుగా పెరిగిన కంప చెట్లను తొలగించాలని మండలంలోని ప్రజలు కోరుతున్నారు. రిజర్వాయర్‌కు అనుసంధానంగా 23 గ్రామాలకు తాగునీరు అందించే ఫిల్టర్ బెడ్స్ కూడా అక్కడే ఉన్నాయని, రహదారి మాత్రం కంప చెట్లతో కప్పివేయబడిందని తెలిపారు. దీంతో వాహనదారులు, రైతులు ఇబ్బందులకు గురవుతున్నారని, ఉన్నతాధికారులు స్పందించి వాటిని తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

డబుల్ బీటీ రోడ్డు నిర్మించండి

వీపనగండ్ల: మండల కేంద్రం నుంచి జిల్లా కేంద్రానికి వెళ్లే ప్రధాన రహదారి బీటీ రోడ్డుగా మార్చాలని ఎన్నో రోజులుగా విజ్ఞప్తి చేస్తున్నా పట్టించుకోవడం లేదని పలు గ్రామాల ప్రజలు ఆవేదన చెందుతున్నారు. వీపనగండ్ల, కల్వరాల్ల, కేతేపల్లి గ్రామాల వరకు 10 కి.మీ.ల బీటీ రోడ్డును డబుల్ బీటీ రోడ్డుగా నిర్మిస్తే ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని, చిన్నంబావి మండల ప్రజలు జిల్లా కేంద్రానికి ఈ రహదారి గుండా వెళ్లితే దాదాపు 10 కి.మీ.లు ఆదా అవుతుందని పేర్కొన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి డబుల్ బీటీ రోడ్డును నిర్మించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ తీగలు



అమరచింత: మండలంలోని కొంకన్వానిపల్లె గ్రామంలో విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం వల్ల విద్యుత్ తీగలు చేతికందే ఎత్తులో ఉన్నాయని, దీంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదాలు జరుగుతాయేనని గ్రామ సీపీఐ నాయకులు తెలిపారు. వేలాడుతున్న విద్యుత్ తీగల విషయాన్ని ఎన్నో సార్లు ట్రాన్స్‌కో ఏఈకి విన్నవించినా ఫలితం లేదన్నారు. లైన్‌మెన్‌కు ప్రతి రోజు విన్నవిస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. వర్షాకాలం సమీపిస్తున్న తరుణంలో విద్యుత్ స్తంభాలకు విద్యుత్ తీగలు వేలాడుతుంటే ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, ఇప్పటికైనా అధికారులు స్పందించి తీగలను సరిచేయాలని లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడామన్నారు. కార్యక్రమంలో అంజి, శ్రీను, చిన్నరాజు, కుతుబ్ ఉన్నారు.



మల్కిమియాన్‌పల్లి శివారులో ట్రాక్టర్లతో దున్నుతున్న రైతులు



ఖిల్లాఘనపురంలో పత్తి విత్తనాలు నాటేందుకు ఎద్దులతో సాలు కొడుతున్న అన్నదాతలు

తొలకరి పలకరింపు.. రైతన్న బిజీబిజీ

- దుక్కుల్లో విత్తనాలు విత్తుకుంటున్న రైతులు
- విత్తనాలు విత్తిన రైతులు స్ప్రింక్లర్లతో తడుపుతున్న వైనం

ఖిల్లాఘనపురం: ఈ ఏడాది రుతుపవనాలు ముందుగానే రాష్ట్రంలోకి ప్రవేశించడంతో తొలకరి వానలు కురిశాయి. రోహిణి కార్తి మధ్యలోనే తొలకరి పలకరించడంతో అన్నదాతలు పొలం పనుల్లో బిజీబిజీగా మారిపోయారు. పొలాల్లో చెత్త ఏరడంతో పాటు ట్రాక్టర్లతో దున్నడం, గుంటుక కొట్టడం లాంటి పనులతో దుక్కులు సిద్ధం చేశారు. ముందే దుక్కులు సిద్ధం చేసుకున్న రైతులు ఎద్దులతో సాల్లు తోలి రోహిణి కార్తి వెళ్లేలోపే పత్తి, జొన్న విత్తనాలు విత్తుకున్నారు. తరువాత వానలు రాకపోవడంతో కొంత మొలకెత్తి మట్టికింద ఆగిన విత్తనాలను మొలకెత్తించేందుకు బోరుబావులు అందుబాటులో ఉన్న రైతులు స్ప్రింక్లర్లు పెట్టి నీటి తడులు అందిస్తున్నారు. ఆలస్యంగా దుక్కులు సిద్ధం చేసుకున్న రైతులు సమయం దాటుతుండటంతో వట్టి పొలంలోనే పత్తి విత్తనాలను విత్తుకుంటున్నారు.



ఖిల్లాఘనపురం మండలం అప్పారెడ్డిపల్లిలో ట్రాక్టర్‌తో గుంటుక కొడుతున్న రైతు



మల్కిమియాన్‌పల్లి శివారులో పత్తి విత్తనాలు నాటుతున్న మహిళా కూలీలు



మానాజీపేట గేట్ సమీపంలో జొన్నపంటకు స్ప్రింక్లర్లతో నీటిని పారిస్తున్న రైతు

వానాకాలం సాగుపై రైతులకు అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

వనపర్తి రూరల్: మండలంలోని పెద్దగూడెం, పెద్దగూడెంతండా, పెబ్బేరు మండలంలోని శాఖాపూర్ వై, తోమాలపల్లి గ్రామాలలో ఆదివారం వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం మదనాపురం కృషి విజ్ఞాన కేంద్రం, మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కేవీకే శాస్త్రవేతలు పాల్గొని ఖరీఫ్ పంటలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు నూనె గింజల సాగుపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. అత్యాధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. పంటల సాగుకు నాణ్యమైన విత్తనాలను ఎంచుకోవాలని, మార్కెట్లో డిమాండ్ మేరకు నూనె గింజలు, చిరుధాన్యాల సాగుపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఆర్ అనిత, జవహర్ డాక్టర్ భవాని, దివ్య, ఏఈఓ కవిత, మాజీ సర్పంచ్ కొండన్న, గ్రామ రైతులు పాల్గొన్నారు.

ప్రజా పోరాటాలతోనే సమస్యల పరిష్కారం

గోపాల్‌పేట: ప్రజా పోరాటాలతోనే ప్రజల సమస్యలు పరిష్కారం అవుతాయని, అందుకు అంతా సిద్ధంగా ఉండాలని సీపీఐ జిల్లా కార్యదర్శి విజయరాములు అన్నారు. ఆదివారం మండలంలోని పొలికెపాడు గ్రామంలో చంద్రయ్య ఆధ్వర్యంలో గ్రామ సభ్యుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోరాటాలు లేకుండా ప్రజల సమస్యలు తీరవని అన్నారు. భారత దేశ స్వాతంత్ర్యం కోసం, ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం కమ్యూనిస్టులు ఎన్నో ఏండ్లు పోరాడారని గుర్తు చేశారు. పేదలకు బంజరు భూముల పంపిణీ, ఇండ్ల స్థలాలు, ఇండ్లు, రైతు రుణమాఫీ, ఉచిత కరెంటు, రైతులకు గిట్టుబాటు ధర, రేషన్‌కార్డులు, ఇతర పేదల సమస్యలపై కమ్యూనిస్టులు పోరాడితేనే పథకాలు అమలయ్యాయని గుర్తు చేశారు. కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి రమేష్, మాజీ కార్యదర్శి శాంతన్న, గ్రామ కార్యదర్శి బుచ్చన్న పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి ఐకమత్యంతో పనిచేయాలి

పాన్‌గల్: ధర్మసమాజ్ పార్టీ (డీఎస్పీ) బలోపేతానికి కార్యకర్తలు ఐకమత్యంతో పనిచేయాలని పార్టీ నియోజకవర్గ నాయకులు ఆది సంధ్యారాణి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. మహనీయుల ఆశయ సాధన కోసం నిరంతరం శ్రమిస్తూ పార్టీని బలోపేతం చేయాలన్నారు. అనంతరం పార్టీ మండల కమిటీని నియమించారు. పార్టీ మండల అధ్యక్షుడిగా రేమద్దుల గ్రామానికి చెందిన శ్రీనిప్రసాద్‌ను, మండల ప్రధాన కార్యదర్శిగా శివరాజ్, కార్యదర్శిగా రాములును నియమించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రామకృష్ణ, శేఖర్, లక్ష్మణ్, సురేందర్ దితరులు పాల్గొన్నారు.



మండల నూతన కమిటీ డీఎస్పీ పార్టీ నియోజకవర్గ నాయకురాలు సంధ్యారాణి

జేఈఈ మెయిన్స్ విద్యార్థికి సన్మానం



అమరచింత: జేఈఈ ఫలితాల్లో ఎస్సీ క్యాటగిరిలో ఆలిండియా స్థాయిలో 412వ ర్యాంక్‌ను సాధించిన సంపత్‌కుమార్‌ను, ఎస్ఎస్‌సీలో 555 మార్కులు సాధించిన విద్యార్థి సమతను కేవీపీఎస్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సన్మా నించారు. పట్టణానికి చెందిన బాలరాజ్, లతల కుమారుడు సంపత్ కుమార్ జేఈఈ మెయిన్స్‌లో ప్రతిభ చూపడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎస్ఈ శ్యాం సుందర్, రాజు, అజయ్, అరు ణ్, భక్తరాజు, బాలరాజ్, లత పాల్గొన్నారు.

తిరంగా యాత్ర జయప్రదం చేద్దాం



పాంరెడ్డిపల్లెలో కరపత్రాలను పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు

అమరచింత: ఆపరేషన్ సిందూర్ విజయవంతం సందర్భంగా అమరచింత పట్టణంలో సోమవారం తిరంగాయాత్ర నిర్వహిస్తున్నామని యాత్రలో ప్రతి ఒక్కరు స్వచ్ఛందంగా పాల్గొనాలని బీజేవైఎం రాష్ట్ర కో కన్వీనర్ మంత్రి సుధీర్, బీజేపీ మండల అధ్యక్షురాలు మంగ లావణ్య తెలిపారు. మండలంలోని పాంరెడ్డిపల్లె, కొంకన్వానిపల్లె గ్రామాలతో పాటు మండల కేంద్రంలో జరిగే కార్యక్రమం విజయవంతం చేయాలని కరపత్రాలతో ప్రచారం నిర్వహించారు. తిరంగా యాత్రలో పాల్గొని వారికి సంఘీభావం ప్రకటించాలని కోరారు.



ఆత్మకూర్‌లో సంబరాలు నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు



మూలమళ్లలో..

కాంగ్రెస్‌తోనే సముచిత న్యాయం

- వాకిటి శ్రీహరికి మంత్రి పదవి రావడంతో మండలాల్లో సంబరాలు
- నియోజకవర్గ అభివృద్ధి ఖాయం

ఆత్మకూర్: కాంగ్రెస్ పార్టీతోనే సముచిత న్యాయం సాధ్యమని, మక్తల్ నియోజకవర్గం నుంచి మొదటిసారి గెలిచిన డాక్టర్ వాకిటి శ్రీహరికి మంత్రి పదవి దక్కడంతో కాంగ్రెస్‌కు మరింత ఆదరణ పెరిగిందని నాయకులు తెలిపారు. ఆదివారం ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి మంత్రిగా ప్రమాణ స్వీకారం చేయడంతో ఆత్మకూర్‌తో పాటు మూలమల్ల, ఖానాపూర్, తిప్డంపల్లి, బాలకిష్టాపూర్ తదితర గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు బాణా సంచా కాల్చి, మిఠాయిలు పంచి సంబరాలు నిర్వహించారు. ముదిరాజ్ సామాజిక వర్గం నుంచి గెలిచిన ఎకైక ఎమ్మెల్యేగా వాకిటికి సముచిత న్యాయం జరిగిందని, నియోజకవర్గం అభివృద్ధి పథంలో పయనించడం ఖాయమని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు గంగాధర్‌గౌడ్, రహ్మతుల్లా, పరమేష్, తులసీరాజ్, శ్రీను, అజ్మతుల్లా, గడ్డం శ్రీనివాస్‌యాదవ్, షాలం, దామోదర్, మహేష్, అశోక్, మచ్చేందర్‌గౌడ్, అశోక్‌సింగ్, సాయిరాఘవ, మణివర్ధన్‌రెడ్డి, ఖాజాపాషా, రాజు, మహేష్, నరేష్, ఉన్నారు.

కాంగ్రెస్, ముదిరాజ్ కులస్తుల సంబరాలు

కొత్తకోట: మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి మంత్రివర్గంలో చోటు కల్పించడంతో కొత్తకోట చౌరస్తాలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ముదిరాజ్ కులస్తులు పెద్ద ఎత్తున సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా బాణా సంచా కాల్చి స్వీట్లు పంచిపెట్టారు. అనంతరం పలువురు నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలోనే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. పార్టీకి అంకిత భావంతో పనిచేసిన వాకిటి శ్రీహరి మొదటిసారి ఎమ్మెల్యేగా అవకాశం రావడంతో పాటు మంత్రి పదవి ఇవ్వడం కాంగ్రెస్ పార్టీకే సాధ్యమైందన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పి.ప్రశాంత్, పి.కృష్ణారెడ్డి, ఎన్‌జె.బోయేజ్, శ్రీనివాస్‌రెడ్డి, మేస్త్రీ శ్రీనివాసులు, భీచుపల్లి యాదవ్, రంగస్వామి, బాలరాజు తదితరులు ఉన్నారు.

టీఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో..

అమరచింత: మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ఆదివారం కెబినెట్ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేయడంతో కాంగ్రెస్ శ్రేణులు ఉత్సాహంగా సంబరాలు నిర్వహించారు. బీసీ సామాజిక వర్గానికి సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం మంత్రి పదవి కల్పించడం సంతోషకరమన్నారు. ఈ మేరకు టీఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో కేక్‌కట్ చేయగా, కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున బాణాసంచా కాల్చారు. రాజీవ్‌గాంధీ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. మంత్రి శ్రీహరి నేతృత్వంలో నియోజక వర్గంతో పాటు మండలం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించడం ఖాయమన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ మహంకాళి విష్ణు, దాసు, వెంకటేశ్వర్‌రెడ్డి, రవికాంత్, దేవరకొండ మోహన్, దేవరకొండ మమత, రాకేష్ గౌడ్, మన్నాన్ పాల్గొన్నారు.



అమరచింతలో కేక్‌కట్ చేస్తూ సంతోషం వ్యక్తం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించండి



కమాలొద్దీన్‌పూర్‌లో ఇంటింటి ప్రచారం చేస్తున్న ఉపాధ్యాయులు

ఖిల్లాఘనపురం: ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు మెరుగైన విద్యను అందించడం జరుగుతుందని, పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని ఎంఈఓ జయశంకర్ అన్నారు. ఆదివారం మండలంలోని సోళీపురం, అప్పారెడ్డిపల్లి, ఖిల్లాఘనపురం, పర్వతాపురం, ఆముదంబండ తండా, వెనికి తండా, మానాజీపేట, కమాలొద్దీన్‌పూర్, ఉప్పరిపల్లి గ్రామాలోల్ ఉపాధ్యాయులు జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. పలుగ్రామాల్లో ఎంఈఓ జయశంకర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల కోసం ప్రభుత్వం ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు, ఉచిత మధ్యాహ్న భోజనం వసతులు కల్పిస్తోందన్నారు.

- పాన్‌గల్ మండల కేంద్రంతో పాటు కేతేపల్లిలో ఎంఈఓ శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం చేస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఉపాధ్యాయ బృందం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయ బృందం, సీఆర్పీలు పాల్గొన్నారు.



ఖిల్లాఘనపురం మండలం సోళీపురంలో..



దావాజిపల్లి బడిబాట కార్యక్రమంలో ఉపాధ్యాయులు

రక్తదానం ఆరోగ్యానికి శ్రేయస్కరం

వనపర్తిటౌన్: రక్తదానం చేయడం ఆరోగ్యానికి మంచిదని, ప్రతి ఒక్కరు రక్తదానం చేయడం అలవర్చుకోవాలని నేషనల్ హెడ్ ఏబీపీసీ హెల్త్‌కేర్ ప్రొఫెషనల్స్ డాక్టర్ జిల్లెల ఆదిత్యరెడ్డి అన్నారు. ఈ మేరకు ఆదివారం జిల్లా కేంద్రంలోని 28వ, వార్డు వెంగళరావు కాలనీలో కోట్ల శిరీష, రవిల ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం, రక్తదాన శిబిరం నిర్వహించారు. రక్తదానంతో ఎదుటి వారి ప్రాణాలను నిలబెట్టిన వాళ్లం అవుతామని చెప్పారు. రక్తదానం చేయడం ద్వారా లాభాలే తప్పితే నష్టాలు ఉండవని, ధైర్యంగా ముందుకొచ్చి రక్తదానం చేయాలన్నారు. రక్తదాన, వైద్య శిబిరాన్ని దాదాపు 300 మంది వినియోగించుకున్నారని కోట్ల రవి పేర్కొన్నారు. కార్యక్రమంలో సామాజిక నాయకుడు పోచ రవీందర్ రెడ్డి, కాంగ్రెస్ మత్స్యశాఖ జిల్లా అధ్యక్షుడు నందిమల్ల యాదయ్య, కోళ్ల వెంకటేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ కదిరే రాములు, ఎండీ బాబా, ఉమ్మల్ల రాములు, నాయకులు నక్క రాములు యాదవ్, ప్రేమ్‌నాథ్‌రెడ్డి, వినోద్‌గౌడ్, శివ గౌడ్, చరణ్ రాజ్, నాగార్జున, రవి సాగర్, నరేష్ సాగర్, దిలీప్ గౌడ్, వంశీ ముదిరాజ్, అబ్దుల్లా, విజయ్, రాములు, జీవన్, నిరంజన్, రోహన్ పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న యువకులు

కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శిగా గుంత రమణ



నియామక పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి

కొత్తకోట రూరల్: మండలంలోని కనిమెట్ట గ్రామానికి చెందిన గుంత రమణ కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ మేరకు దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి ఆదివారం నియామక పత్రాన్ని గుంత రమణకు అందజేశారు. తనపై నమ్మకం ఉంచి కీలక బాధ్యతలు అప్పగించిన ఎమ్మెల్యేకు, మండల సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులకు గుంత రమణ కృతజ్ఞతలు తెలిపారు. మండలంలో కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తానని ఆయన తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పి.ప్రశాంత్, జెడ్పీటీసీ మాజీ సభ్యులు డాక్టర్ పీజే.బాబు, ఎన్‌జే.బోయేజ్, మేస్త్రీ శ్రీనివాసులు, భీచుపల్లి యాదవ్, నర్సింహశెట్టి, కృష్ణారెడ్డి ఉన్నారు.

ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఉద్యమం చేస్తాం

వనపర్తిటౌన్: దేశంలో అంబేడ్కర్ ఉన్నప్పటి నుంచి ఇప్పటి వరకు ఇంకా మిగిలి ఉన్న సమస్యలపై ఎమ్మార్పీఎస్ ద్వారా దేశవ్యాప్త ఉద్యమం చేస్తామని ఎమ్మార్పీఎస్, ఎంపీఎస్ జిల్లా ఇన్‌చార్జి టైగర్ జంగయ్య పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం జిల్లా కేంద్రంలోని రిటైర్డ్ ఉద్యోగుల భవనంలో ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల కార్యవర్గ సమావేశాన్ని జిల్లా అధ్యక్షుడు కొమ్ము చెన్నకేశవులు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా జంగయ్య మాట్లాడుతూ సామాజిక, ఆర్థిక, రాజకీయ అసమానతలు లేని నూతన సమాజ నిర్మాణాన్ని మహాజన నేత మందకృష్ణ మాదిగ సారథ్యంలో సాధిస్తామన్నారు. సమాజ మద్దతుతో సుదీర్ఘకాలం పాటు ఉద్యమం నడిపి విజయం సాధించామన్నారు. జూలై 7న ఎమ్మార్పీఎస్ 31వ, ఆవిర్భావ దినోత్సవ వేడుకలు గ్రామ గ్రామాన ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు అజ్జాపాగ లక్ష్మణ్, గంధం గట్టయ్య, మంద నరసింహ, గట్టు స్వామి, బాబు, దండు శ్రీనివాసులు, మచ్చ తిరుపతి, పెరుమాళ్ల రామకృష్ణ, రమేష్, వర్మ, కృష్ణ, రమేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టైగర్ జంగయ్య

ఇంటర్ కళాశాల ఏర్పాటు చేయండి

అమరచింత: మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలను వెంటనే ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు రాఘవ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ మక్తల్ ఎమ్మెల్యేగా గెలుపొందిన వాకిటి శ్రీహరి గతంలో ఇచ్చిన హామీ అమలు కాలేదని, ప్రస్తుతం మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన మంత్రి శ్రీహరి ఇక్కడి విద్యార్థుల బాధలు తెలుసుకుని కాలేజీ మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో వినయ్, రమేష్, రాము ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాఘవ

వేంకటేశ్వరస్వామి ఆలయ హుండీ లెక్కింపు

కొల్లాపూర్: పట్టణంలోని బండాయిగుట్ట వేంకటేశ్వరస్వామి దేవాలయం హుండీ లెక్కింపు ఆదివారం నిర్వహించారు. ఆలయ ఫౌండర్ ట్రస్టీ ఆదిత్య లక్ష్మారావు సమక్షంలో ఆలయ కమిటీ సభ్యులు హుండీ లెక్కించారు. మూడు సంవత్సరాల తర్వాత హుండీ లెక్కించారు. మొత్తం రూ.8వేలు మాత్రమే ఉండటంతో పలు అనుమానాలకు తావిస్తోంది. హుండీలో అయస్కాంతాలు, చూయింగ్‌గమ్‌లు ఉండడంతో హుండీ డబ్బులు చోరీకి గురై ఉంటాయని ఆలయ కమిటీ సభ్యులు భావిస్తున్నారు. భక్తులు సమర్పించిన కానుకలను ఆలయ అకౌంట్‌లో జమచేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.



హుండీ లెక్కింపులో ఆలయ కమిటీ సభ్యులు